క్లుప్తంగా

సోలార్ ప్లాంట్లతో ప్రయోజనం

కొణిజర్ల: ఒకసారి సోలార్ ప్లాంట్ ఏర్పాటుచేసుకుంటే ఏళ్ల తరబడి విద్యుత్ అందుతుందని రెడ్‌కో జిల్లా మేనేజర్ అజయ్‌కుమార్, పెద్దగోపతి డీఈ బి.తిలక్ తెలిపారు. సోలార్ విద్యుత్‌పై కొణిజర్ల, పెద్దగోపతిలో బుధవారం నిర్వహించిన సదస్సుల్లో వారు మాట్లాడారు. ఐదు వేలకు పైగా జనాభా కలిగిన జీపీలను ఎంపిక చేయగా, పీఎం కుసుమ్ పథకం ద్వారా ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశముందని తెలిపారు. అత్యధిక ప్లాంట్లు ఏర్పాటైన గ్రామాలకు రూ.కోటి నజరానా అందుతుందని చెప్పారు. మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు, సొసైటీ వైస్ చైర్మన్ సూరంపల్లి రామారావు, ఏఈలు రాజారత్నం, రాయల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం అమలు తీరును మండల ప్రత్యేకాధికారి విజయ్‌చంద్ర, ఎంఈఓ బి.మురళీమోహన్‌రావులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, వంట మరింత రుచిగా చేయాలని కార్మికులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జీవీఎస్ రాజు తదితరులున్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎర్రుపాలెం: గ్రామ పంచాయతీల కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కమిటీ కార్యదర్శి మద్దాల ప్రభాకర్, పంచాయతీ కార్మికుల సంఘం మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంతాల నాగేశ్వరరావు, కలపాల రవి తెలిపారు. పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సునీల్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దూదిగం శ్రీనివాసరావు, పెద్దమళ్ల శ్రీనివాసరావు, బొక్కా నాగేశ్వరరావు, బాజీ, లాలు, అనిల్, జమలయ్య, తదితరులున్నారు.

ఈ నెల 12న ఛలో ప్రజాభవన్

సత్తుపల్లిరూరల్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఆ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టే ×ఛలో ప్రజాభవన్‌ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కొత్తగూడెం రీజియన్ అధ్యక్షుడు అమర్లపూడి శరత్ అన్నారు. బుధవారం సమంత క్యాంప్‌లో పీఎస్‌సీడబ్ల్యూ ఆధ్వర్యంలో.. ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో జేఏసీ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి 20నెలలు దాటినప్పటికీ ఎన్నికల సమయంలో పెంచుతామన్న వేతనాలను నేటికీ పెంచలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కట్ల ప్రసాద్, వై.కనకయ్య, రవివర్మ, నరేష్, ఎస్ఏ యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టికి వినతి

బోనకల్: సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా బుధవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, ఆర్థికేతర సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో ముందుగా పరిష్కరించనున్నట్లు డిప్యూటీ సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు యాదగిరి, సహదేవ్, జానకీరామ్, మహిందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

తల్లాడ/కల్లూరురూరల్/కొణిజర్ల: చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభకు బుధవారం తల్లాడ, కల్లూరురూరల్, కొణిజర్ల మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. బస్సుల, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తరలి వెళ్లారు. కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, నాయకులు దగ్గుల రఘుపతిరెడ్డి, రాయల రాము, తుమ్మలపల్లి రమేష్, కొమ్మినేని వెంకటేశ్వర్లు, పొన్నం కృష్ణయ్య, ఎ.కృష్ణ, పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, ఏనుగు సత్యంబాబు, భాగం ప్రభాకర్, తక్కెళ్లపాటి ప్రసాద్, కోడవాటి వెంకటేశ్వరరావు, పెద్దబోయిన శ్రీనివాసరావు, బైర్ల కాంతారావులు తదితరులు పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీ

ఉన్నట్టా.. లేనట్టా..?



విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

- మూడు నెలలుగా విద్యార్థులకు అందని రాగిజావ
- సెప్టెంబర్ నుంచి పంపిణీ అని ప్రచారం..
- పాఠశాలలకు చేరని రాగిపిండి, బెల్లం

కొణిజర్ల: విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు గత ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆ జాడే లేదు.. సెప్టెంబర్ నుంచి పంపిణీ చేస్తారని ప్రకటనలు విడుదల అయినా ఇంతవరకు పాఠశాలలకు రాగిపిండి, అందులో కలిపేందుకు బెల్లం పౌడర్ పంపిణీ చేయలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల మదిలో ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మండలంలోని పాఠశాలల వివరాలిలా..

కొణిజర్ల మండలంలో 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 11 ప్రాథమికోన్నత పాఠశాలలు, 54 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటితోపాటు రెండు ఆశ్రమ పాఠశాలలు, రెండు గురుకులాలు, కస్తూర్బా బాలికల పాఠశాల ఉన్నాయి. వీటన్నింటిలో కలిపి సుమారుగా 8వేల మందికి పైగా బాల బాలికలకు విద్య నభ్యశిస్తున్నారు. అయితే ఈ పంపిణీ పథకాన్ని శ్రీ సత్యసాయి, అన్నపూర్ణ ట్రస్టు వారి ఆధ్వర్యంలో అమలు చేస్తుండగా.. జావ తయారీకి వంట ఏజెన్సీలకు గ్లాసుకు 25పైసల చొప్పున ప్రభుత్వం పారితోషికం చెల్లిస్తుంది. ఈ పథకం అమలుకు నోచుకోక రెండు నెలలు గడవడంతో ఇకపై రాగిజావ పంపిణీ ఉంటుందో లేదోనని విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంతవరకు స్టాకు రాలేదు..



రాగి జావ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన మాట వాస్తవమే కానీ ఇప్పటివరకు రాగి పిండి బెల్లం పంపిణీ చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క సారే అన్ని ఎమ్మార్సీలకు రాగి పిండి పంపిణీ చేసేవారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి ఎమ్మార్సీ నుంచి హెచ్‌ఎంలకు అందజేసేవాళ్లం. గత ఏడాది వరకు ఇలాగే కొనసాగింది. ఈ ఏడాది ఇంత వరకు రాలేదు పంపిణీ ఎలా చేస్తారో తెలియదు.

– దొడ్డిగర్ల అబ్రహం, ఎంఈఓ, కొణిజర్ల

విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ఉద్యమం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

సత్తుపల్లిరూరల్: దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో రాష్ట్రప్రభుత్వ సాచివేత ధోరణిపై అనివార్యమైతే ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్యాణం కృష్ణయ్య, సుబ్బయ్య తెలిపారు. సత్తుపల్లిలోని సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు ఏళ్ల తరబడి తమకు రావాల్సిన నగదు కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. బకాయిలు, పీఆర్సీ, హెల్త్ కార్డుల సాధనకు అవసరమైతే ఉద్యమం చేస్తామని తెలిపారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘం సత్తుపల్లి యూనిట్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కేశవరెడ్డి, సూర్యప్రకాశరావు, ఉపాధ్యక్షులుగా డి.కృష్ణయ్య, వాణి, సహాయ కార్యదర్శులుగా సాంబశివరెడ్డి, నర్సయ్య, ప్రచార కార్యదర్శిగా మధుసూదనరాజు, జిల్లా కౌన్సిలర్‌గా యోగానదం, కమలకుమారి, మహబూబ్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో బద్రుద్దీన్, అద్దంకి వెంకటరత్నం, రామిశెట్టి సుబ్బారావు, వేల్పుల కృష్ణయ్య, రఘుపతిరెడ్డి, బీ.వీ.రామారావు, సరోజిని, సూరా సత్యనారాయణ, మాధవరెడ్డి, రత్తయ్య, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

బోనకల్: మండలంలోని చిరునోములలో మోటర్ సైకిల్ చోరీకి గురైంది. గ్రామవాసి కరివేద పిచ్చయ్య తన బైక్‌ను కారుతో పాటు ఇంటి ముందు మంగళవారం రాత్రి పార్క్ చేశాడు. బుధవారం ఉదయంకల్లా బైక్ లేకపోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

తల్లాడ బ్రాంచ్‌ను సందర్శించిన డీసీసీబీ చైర్మన్



తల్లాడ బ్రాంచ్‌లో డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వరరావు

తల్లాడ: తల్లాడ సహకార బ్యాంక్‌ను బుధవారం ఖమ్మం డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా తల్లాడ బ్రాంచ్ మేనేజర్ కవితను బ్యాంక్ డిపాజిట్లు, బ్యాక్ రుణాల రికవరీ ఎలా ఉందని అడిగారు. అలాగే బ్యాంక్ ఖాతాదారులు, రైతుల సమస్యలు పెండింగ్ లేకుండా తక్షణమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్ ఉషా, సూపర్‌వైజర్ ప్రభాకర్, మురళీమోహన్‌రావు పాల్గొన్నారు.

బోరు మరమ్మతులకు నగదు వితరణ

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి బోరు మరమ్మతులకు గురైంది. భీమవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు యరమల పూర్ణచంద్రారెడ్డి విషయం తెలుసుకొని రూ.15వేలతో బోరును బాగుచేయించారు. దీంతో గ్రామస్తులు దాత పూర్ణచంద్రారెడ్డిని అభినందించారు.

ఆలయం వద్ద అన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మధిర: మధిరలోని మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాల నాగేశ్వరరావు – అనిత దంపతుల సహకారంతో అన్నదానం ఏర్పాటుచేశారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కనుమూరి వెంకటేశ్వరరావు, ఆలయ అన్నదాన కమిటీ నిర్వాహకులు కోనా జగదీష్‌తో పాటు రేగళ్ల సాంబశివరావు, మందడపు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం పోటీ

వేంసూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సీపీఎం పోటీ చేస్తుందని సీపీఎం మండల కమిటీ సభ్యుడు మల్లూరు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని మర్లపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 10 నుంచి 17 వరకు వీర తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల అన్ని ప్రజా సంఘల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డంకర శ్రీను, సాధు శరత్, బొందల యాకుబో, పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

పెనుబల్లి: ఈ నెల 15న పెనుబల్లి ప్రజానాట్యమండలి మండల మహాసభను జయప్రదం చేయాలని సత్తుపల్లి డివిజన్ అధ్యక్షుడు ఖండే సత్యం అన్నారు. బుధవారం మండలంలో ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో.. మత్రి రజిని అధ్యక్షతన నిర్వహించిన కళాకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో కళాకారులు కీలక పాత్ర వహించారన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి సనందన్‌రావు, డివిజన్, మండల బాధ్యులు పరిగడుపు రాములు, బల్లి అబ్రహం, కృష్ణవేణి, యశోద తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ సబార్డినేట్ మృతి



భాస్కరరావు (ఫైల్)

మధిర: మధిర తహసీల్ సబార్డినేట్ పగిడిపల్లి భాస్కరరావు(60) మృతి చెందారు. దెందుకూరుకు చెందిన ఆయన వీఆర్ఏగా పనిచేస్తూ ఇటీవలే సబార్డినేట్‌గా వచ్చారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బుధవారం మృతి చెందిన ఆయనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. కాగా, ఆయన మృతదేహం వద్ద తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు, ఉద్యోగులు నివాళులర్పించారు.

ఉన్నత లక్ష్యంతో చదవండి..

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఇన్‌స్పైర్‌ఇగ్నైట్ ఫౌండేషన్ నిర్వాహకులు డి.రంజిత్, శ్రీరాం, సుధాకర్ అన్నారు. సత్తుపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇన్‌స్పైర్ సంస్థ ఆధ్వర్యాన బుధవారం విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ప్రమీలా, వనజారాణి, శ్వేత, కృష్ణవేణి, కల్పన, సత్యనారాయణ, రామారావు, శిరో మణి, వెంకటేశ్వర్లు, సౌజన్య, సమ్మక్క పాల్గొన్నారు.

సర్దార్ జమలాపురం కేశవరావు జయంతి

మధిర: మధిరలో బుధవారం సర్దార్ జమలాపురం కేశవరావు జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి కనుమూరు వెంకటేశ్వరరావు, మందడపు వెంకటనారాయణ, కోనా జగదీష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పూజలు.. అన్నదానాలు..

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా.. బుధవారం గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేయగా పలువురు దంపతులు పూజలో పాల్గొన్నారు. అనంతరం కులమతాలకు అతీతంగా అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల గ్రామాల్లోని పుర వీధుల్లో వినాయకులను ఊరేగించి.. అనంతరం సమీపంలోని నదులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లి: పూజలు చేస్తున్న అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



ముదిగొండ: కమలాపురం బీసీ కాలనీలో..



వైరా: పూజలో పాల్గొన్న తహసీల్దార్ కేవీ శ్రీనివాస్, ఎస్ఐ రామారావు

అడ్డగోలుగా మిషన్ భగీరథ పనులు



రిలయన్స్‌బంక్ పక్క వీధిలో తవ్వి వదిలేసిన గుంత

సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణంలో మిషన్‌భగీరథ పనులు ఇష్టారీతిన చేపట్టడంపై ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ తవ్వేస్తూ.. వదిలేస్తూ అసౌకర్యంగా పనులు చేపడుతున్నారంటూ ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమృత్ పథకంలో భాగంగా చేపట్టిన పనులు ఒక దశదిశ లేకుండా చేపడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

మార్కింగ్ లేకుండానే..

మిషన్ భగీరథ పైపులైన్ తవ్వకాలు చేపట్టేటప్పుడు ఆ వీధిలోని ఇళ్ల యజమానులతో చర్చించి.. మున్సిపల్ ఏఈ మార్కింగ్ తీసుకొని చేపట్టాల్సిన పనులను ఇష్టారీతిగ చేపట్టడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాత సెంటర్‌లోని హనుమాన్‌నగర్ ఎదురుగా గల రిలయన్స్ పెట్రోల్‌బంక్ పక్క వీధిలో పైపులైన్ నిర్మాణం కోసం చేపట్టిన తవ్వకాలను స్థానికులు అడ్డుకున్నారు. ఓవైపు కరెంట్ స్తంబాలు, మరోవైపు పైపులైన్లు వేయాలని అనుకుని.. ఇప్పుడు ఎవరికీ చెప్పకుండా విద్యుత్ స్తంభాలవైపే పనులు చేపట్టడంతో స్థానికులు అడ్డుకున్నారు. అదే విధంగా సత్తుపల్లి పట్టణంలోని మెయిన్‌రోడ్ లింక్ రోడ్‌లు తవ్విన తర్వాత సరిగా సరిగా పూడ్చకపోవటంతో గోతులుపడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఈ పనులను కొందరు బినామీలకు అప్పగించడంతో బాధ్యతారహితంగా పనులు జరుగుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు.

పంట నష్టంపై సర్వే



పెసర పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఏన్కూరు: మండలంలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలపై వ్యవసాయ అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. మండల పరిధిలోని తూతకలింగన్నపేట, ఏన్కూరు, జన్నారం గ్రామాల్లో దెబ్బతిన్న పెసరపంటలను పరిశీలించారు. ఈ వివరాలను జిల్లా అధికారులకు పంపించనున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నర్సింహారావు, ఏఈఓలు లహరి, నవ్య, రైతులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



వైరా ఏఓకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా: ఇటీవల కురిసిన భారీ వర్షాలు తుఫాన్‌కు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయి కోయడానికి కూడా పనికిరాకుండా పోయిన పెసర పంటకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం వైరా మండల వ్యవసాయాధికారి మయాన్ మంజుఖాన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడారు. పెసర పంట కోయకుండానే చేలోనే మొక్కలు వచ్చి పెసర పూర్తిగా కుళ్లిపోవడంతో రైతులు కన్నీళ్లతో దున్ని వేసుకున్నారన్నారు. ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి పంట నష్టపరిహారం అందివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కిలారు శ్రీనివాసరావు, ఆళ్ల రాంబాబు, అప్పారావు, రాజా, రాజేంద్రప్రసాద్,శ్రీనివాసరావు, ప్రసాద్, గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

మత్కేపల్లిలో..

చింతకాని: మండలంలోని మత్కేపల్లిగ్రామంలో నష్టపోయిన పెసర పంటలను బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సదర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు రమేష్, హనుమంతురావు, రత్నాకర్, రంగారావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ఎదుట నిరసన



ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

సత్తుపల్లిటౌన్: రైతులకు సరిపడా యూరియా అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వామినాధన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరుతూ బుధవారం సత్తుపల్లి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ఎదుట సీపీఎం రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘంజిల్లా నాయకుడు రావుల రాజబాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి ప్రతి రైతుకు సరిపడా యూరియా అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సర్వేశ్వరరావు, మోరంపూడి వెంకట్రావ్, వెంకటేశ్వరరావు, ఝాన్సీ, శ్రీహరి, రాము, భాస్కర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పోల్ ట్యాక్స్ రద్దు చేయాలి

చింతకాని: పోల్ ట్యాక్స్‌ను పూర్తిస్థాయిలో రద్దు చేయాలని కేబుల్ ఆపరేటర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని నాగులవంచలో పలువురు బుధవారం మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా చింతకాని, కొణిజర్ల మండలాల్లో విద్యుత్ అధికారులు పోల్ ట్యాక్స్ చెల్లించాలని ఆపరేటర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారని, లేకపోతే కేబుల్ కనెక్షన్లు తొలగిస్తామంటూ ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్త విధానాన్నే ఈ మండలాలకూ వర్తింపచేయాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఆపరేటర్ల సంఘం బాధ్యులు పమ్మి సురేష్, దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన సీతారామయ్య, ఇనుకుళ్ల అనంతరెడ్డి, గుర్రం వెంకటేశ్వర్లు, కందిమళ్ల కృష్ణారావు, మోరెం వెంకటేశ్వర్లు, బింగి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

దవాఖానాలు కిటకిట..

ముసురుకుంటున్న సీజనల్ వ్యాధులు

- ఆస్పత్రులకు పెరుగుతున్న తాకిడి
- ముమ్మరంగా జ్వర సర్వే



ప్రభుత్వాస్పత్రిలో జ్వర పీడితులు



కిటకిటలాడుతున్న ప్రభుత్వాస్పత్రి

సత్తుపల్లిటౌన్: వారంరోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో సీజనల్ వ్యాధులు ముసురుకుంటున్నాయి. దగ్గు, జలుబు, నొప్పులు, నీరసం, జ్వరం లక్షణాలతో వస్తున్న రోగులతో సత్తుపల్లి ఏరియా ప్రభుత్వాస్పత్రితో పాటు ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వాస్పత్రిలో రోజుకు 150 నుంచి 250 వరకు ఉండే ఓపీ వారం రోజులుగా 300 ఓపీ దాటుతోంది. ఇందులో 200 మందికి రక్త పరీక్షలు తప్పనిసరి చేయాల్సి వస్తోంది. వానలతో దోమలు వృద్ధి చెందటంతో సత్తుపల్లి ప్రాంతంలో రోజురోజుకు జ్వర పీడితులు పెరుగుతున్నారు.

డివిజన్‌లో 12 డెంగీ కేసులు..

ఇళ్లు, పరిసరాల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వైద్యారోగ్యశాఖ అవగాహన కల్పిస్తున్నా వర్షాల వల్ల అపరిశుభ్రత నెలకొంటోంది. డివిజన్‌లో ఇప్పటి వరకు 12 డెంగీ కేసులు నమోదయ్యాయి. డివిజన్‌లోని ఏరియాఆస్పత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ముమ్మరంగా నివారణ చర్యలు..

పట్టణాలతో పాటు అన్ని గ్రామాలలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన జ్వర సర్వే ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపడుతున్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఈ సర్వే చేస్తూ రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. డెంగీ కేసు నమోదైన ఏరియాలలో దోమల నివారణ మందులు స్ప్రే చేయించటమే కాకుండా ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాలలో దోమల నివారణ చర్యలు ముమ్మరంగా ఉన్నాయని, ఫాగింగ్ చేయటం లేదనే విమర్శలు వస్తున్నాయి.

అందుబాటులో వైద్య సేవలు..



వర్షాలతో సీజనల్ వ్యాధులు వస్తున్నాయి. ఓపీ పెరిగినా రోగులకు సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నాం. జ్వర పీడితుల పరిస్థితి అదుపులోనే ఉంది. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవటంతో వ్యాధుల బారినపడకుండా కాపాడుకోవచ్చు. నాలుగు నెలలకు సరిపడా సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు, ఐవీ ఫ్లూయిడ్స్ ఇంజక్షన్లు సిద్ధంగా ఉన్నాయి.

– కె.వెంకటేశ్వర్లు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, సత్తుపల్లి